

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.11,30,541లు, బంగారం 4గ్రాముల 850 మిల్లీగ్రాములు, వెండి 64 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వ్యాన్‌ను ఢీకొన్న ట్యాంకర్

పికప్ వ్యాన్‌ను ట్యాంకర్ ఢీకొట్టింది. ఒకరు గాయపడ్డారు.

- 10లో



అభివృద్ధి పనుల ప్రారంభం

గజపతి జిల్లాలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. మంత్రి పాల్గొన్నారు.

- 10లో

న్యూస్‌రీల్

నీలగిరి అడవిలో ఆత్మహత్య



చెట్టుకు ఉరి పోసుకొని ఆత్మహత్య చేసుకున్న సుకాంత గౌడ

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ పోలీసు స్టేషన్ పరిధిలో గల నీలగిరి అడవిలో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం కొంత మంది గ్రామస్తులు నీలగిరి అడవిలో ఒక చెట్టుకు గావంచాతో ఉరిపోసుకొని ఉండటం చూసి బొరిగుమ్మ పోలీసులకు తెలియజేశారు. పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి బొడొదుబులి గ్రామం సుకాంత గౌఢ(23) అని గుర్తించారు. వారి వివరణ ప్రకారం.. బొడొదుబులి గ్రామంలో నివసిస్తున్న సుకాంత్ గౌఢ మానసిక రోగి అని, అతడు గత బుధవారం నుండి కనిపించటం లేదని గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం బొడొదుబులి గ్రామానికి కిలోమీటరు దూరాన గల నీలగిరి అడవిలో ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతుని తండ్రి పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ చందన ప్రసాద్ మరిఝి దర్యాప్తు చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం పంపామని పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా-17 మందికి గాయాలు



ప్రమాద దృశ్యం

మల్కన్‌గిరి: ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో 17 మంది గాయపడ్డారు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి నక్కమామ్మిడి పంచాయతీ బయ్యాపోడ ఘాటీ వద్ద శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో చోటుచేసుకుంది. కుడుములగుమ్మ పంచాయతీలో జరుగుతున్న వారపు సంతకు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకోవడానికి స్థానికులు ట్రాక్టర్‌పై వస్తుండగా బయ్యాపోడ ఘాటీ వద్ద అదుపుతప్పి బోల్తా పడడంతో ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన 17 మందిని స్థానికుల సహాయంతో కుడుములగుమ్మ ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పిందని.. లేకుండా పలువురు ప్రాణాలు కోల్పోయేవారని స్థానికులు తెలిపారు.

కోడిపందాల శిబిరంపై పోలీసుల దాడి

- మేక, ద్విచక్ర వాహనాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మేక

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి గొడిగూఢ పంచాయతీలో నిర్వహిస్తున్న కోడిపందాల శిబిరంపై పోలీసులు ఆకస్మికంగా దాడులు చేపట్టారు. పందాలు నిర్వహిస్తున్నట్టు తెలుసుకొని ఎస్‌డీపీవో ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో తన సిబ్బందితో దాడి చేశారు. అయితే పోలీసుల రాకను పసిగట్టిన నిర్వాహకులు అక్కడ నుంచి పరారయ్యారు. దీంతో పందాల్లో గెలిచే వారికి ఇవ్వటానికి తీసుకొచ్చిన మేక, ఏడు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకొని మల్కన్‌గిరి స్టేషన్‌కు తరలించారు. నిందితులు స్వచ్ఛందంగా లొంగిపోతే మేకను ఇచ్చేస్తామని.. లేకపోతే కోర్టుకు తరలిస్తామని పోలీసు ఐసీ రీగాన్ కీండో అన్నారు. అప్పటి వరకు పోలీసుల సంరక్షణలో మేక ఉంటుందన్నారు.

వేసవి శిబిరం ప్రారంభం



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రానికి సమీపంలోని చలాన్‌గూడ పంచాయతీ ప్రధాన్‌గూడ గ్రామంలో ఉన్న ఏకలవ్య ఆదర్శ పాఠశాలలో జిల్లా శిశు సంరక్షణ యూనిట్, జిల్లా అధికారుల సహకారంతో ఐదు రోజుల వేసవి శిబిరం శనివారం ప్రారంభించారు. హాస్టల్‌లో బయటకు వెళ్లలేని చిన్నారుల్లో చైతన్యం కోసం శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ వినోద్ పటేల్ హాజరయ్యారు. విద్యార్థులు జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు.

జగన్నాథుని కోసం..
పట్టు పోగుల తరలింపు



జెండా ఊపి పట్టు పోగుల వాహనం ప్రారంభించిన మంత్రి ప్రదీప్ బొలొ సామంత



పట్టు పోగుల వాహనానికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి ప్రదీప్ బొలొ సామంత

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని అలంకరణ తదితర కార్యక్రమాల్లో వినియోగించే పట్టు పోగుల్ని శ్రీ మందిరానికి తరలించారు. స్థానిక షహీద్ నగర్‌లోని ఒడిశా సహకార టసర్, రేషమ్ మహాసంఘ్ (సెరిఫెడ్) కార్యాలయ ప్రాంగణం నుంచి ప్రత్యేక వాహనంలో 350 కిలో గ్రాముల పట్టు పోగుల్ని పూరీ శ్రీ మందిరానికి తరలించారు. ఈ సందర్భంగా వాహన ప్రారంభం ప్రాంగణంలో లాంచనంగా పూజాదులు నిర్వహించారు. ధూపదీపాదులతో మంగళ హారతి సమర్పించి సాగనంపారు. రాష్ట్ర సహకార, చేనేత, హస్తకళల శాఖ మంత్రి ప్రదీప్ బొలొ సామంత జెండాను ఊపి పట్టు పోగుల రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విభాగ అధికారులు భక్తి శ్రద్ధలతో పాలుపంచుకున్నారు.

ఈ పట్టు పోగుల్ని రత్న వేదికపై కొలువు దీరిన బలభద్ర స్వామి, దేవీ సుభద్ర, శ్రీ జగన్నాథుడు, సుదర్శనుని అలంకరణ కోసం వినియోగిస్తారు. రథ యాత్ర, రక్షా బంధన్ ఇతరేతర పండగ పబ్బాలు సందర్భంగా నిర్వహించే ప్రత్యేక ఉత్సవాల్లో వినియోగిస్తారు. శ్రీ మందిరం పాలన వర్గం అభ్యర్థన మేరకు అవసరమైన పట్టు పోగుల్ని రవాణా చేస్తారు. 1981 సంవత్సరం నుండి, సెరిఫెడ్ శ్రీమందిరానికి ఈ పోగుల్ని నిరవధికంగా సరఫరా చేస్తోంది. ఈ ఏడాది 350 కిలోగ్రాముల పట్టు పోగుల్ని తరలించింది. ఈ పట్టు పోగుల్ని మల్బరీ పురుగుల నుంచి తయారు చేస్తారు. దీనిని ప్రధానంగా గజపతి జిల్లాలోని మోహన, ఆర్.ఉదయగిరి మండలాల్లో గిరిజన పట్టు రైతులు ఉత్పత్తి చేస్తారు. కొరాపుట్ జిల్లా నుంచి సేకరించిన కై తా పండ్ల గుజ్జుతో పోగులకు రంగు పూస్తారు.

గిరిజనుల నుంచి సేకరించిన ముడి పట్టు పోగుల్ని కటక్ జిల్లా నువాపట్నా ప్రాంతంలో సిల్క్ ప్రొడక్షన్ – టెక్నికల్ అప్‌గ్రేడేషన్ సెంటర్‌లో అవసరానికి అనుగుణంగా పోగుల్ని తయారు చేస్తారు. ఈ పోగులను కేవలం శ్రీ మందిరంలో మూల విరాటుల సేవాదులకు మాత్రమే వినియోగిస్తారు. ఇతరేతర వ్యవహారాలు, ప్రయోజనాలకు ఏమాత్రం వినియోగించరని తెలిపారు.

చేనేత వస్త్రాల శాఖ డైరెక్టర్ ప్రేమచంద్ర చౌదరి, హస్తకళల విభాగం డైరెక్టర్ ప్రణతి ఛొత్రాయ్, సంయుక్త కార్యదర్శి మధుమిత రథ్, సెరిఫెడ్ చైర్‌పర్సన్ భగీరథి నందా, సెరిఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విక్రమాదిత్య బారిక్ ఈ కార్యక్రమంలో ప్రముఖంగా పాల్గొన్నారు.

రథయాత్ర పర్యవేక్షణకు మంత్రివర్గ కమిటీ ఏర్పాటు

భువనేశ్వర్: పూరీలో జరిగే ప్రపంచ ప్రఖ్యాత జగన్నాథ స్వామి రథోత్సవానికి ప్రభుత్వ స్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించడం, మార్గదర్శకత్వం చేయడం కోసం ఒక ఉన్నత స్థాయి మంత్రివర్గ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. దీనికి సంబంధించి రాష్ట్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర న్యాయ, నిర్మాణ మరియు అబ్కారీ శాఖ మంత్రి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, గృహనిర్మాణం మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వాణిజ్యం మరియు రవాణా విభాగం మంత్రి ఈ కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. రాష్ట్ర న్యాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఈ కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

అంవాఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు

రథయాత్ర ఏర్పాట్లను ప్రభుత్వ స్థాయిలో సమగ్ర పర్యవేక్షణకు ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా సారథ్యం వహిస్తారు. తాజాగా బెంగళూరులో జరిగిన తొక్కిసలాట వంటి అవాంఛనీయ సంఘటనలు పూరీ రథయాత్రలో పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందు జాగ్రత్తతో వ్యవహరిస్తుంది. పూరీలో ప్రపంచ ప్రఖ్యాత రథయాత్ర నిర్వహణ యంత్రాంగం సమర్థవంతమైన సమన్వయం మరియు నిర్వహణను నిర్ధారించేందుకు ఉన్నత స్థాయి మంత్రివర్గ కమిటీ బాధ్యత వహిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన లక్షలాది మంది భక్తులు ఏటా జరిగే శ్రీజగన్నాథుని వార్షిక రథయాత్ర ప్రత్యక్షంగా తిలకించేందుకు తండోపతండాలుగా తరలి వస్తారు. రద్దీ విపరీతంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రథయాత్రతో ముడిపడి ఉన్న విభిన్న వర్గాలు పలు సవాళ్లను సమయస్ఫూర్తితో సమర్థవంతంగా స్పందించే రీతిలో బహుళ విభాగ సమన్వయ వ్యూహాన్ని ఉన్నత స్థాయి కమిటి పర్యవేక్షిస్తుంది. ఈ చర్యల్లో భాగంగా భక్తుల భద్రత, ఆరోగ్య సంరక్షణ, వాహనాల రద్దీ నివారణ తదితర యాత్ర సంబంధిత సమగ్ర కార్యకలాపాల్లో తప్పిదాల నివారణకు అధికార యంత్రాంగం ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తుంది.

ధాన్యం సేకరణపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న మంత్రి కృష్ణచంద్ర పాత్రో తదితరులు

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రస్తుత రబీ సీజన్‌లో ధాన్యం సేకరణను ఆహార సరఫరాలు మరియు వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్రో సమీక్షించారు. ఒడిశా రాష్ట్ర సరఫరా కార్పొరేషన్ సమావేశం హాల్ ప్రాంగణంలో అధికారులతో సమావేశమై మంత్రి సమీక్షించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఆహార సరఫరా కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సుదర్శన్ చక్రవర్తి ధాన్యం సేకరణ వివరాలను ప్రవేశపెట్టారు. ప్రస్తుత రబీ సీజన్‌లో రాష్ట్రంలోని దాదాపు 88 వేల మంది రైతుల నుంచి ఇప్పటివరకు దాదాపు 6 లక్షల 6 వేల మెట్రిక్ టన్నుల వరిని కొనుగోలు చేశారు. అదనపు సాగు పెట్టుబడి మరియు కనీస మద్దతు ధర కింద రైతాంగం పొదుపు ఖాతాలకు సుమారు రూ.1,566 కోట్లు ప్రత్యక్షంగా బదిలీ చేశారు.

సేకరణ వేగవంతం

రుతు పవనాలు వస్తున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. మండీల్లో రైతులు పోగు చేసిన ధాన్యం రక్షణకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం వివిధ చర్యలు చేపడుతుందన్నారు. వరి సేకరణ సమయంలో ఏవైనా అవకతవకలు జరిగాయని ఫిర్యాదు వస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న 214 గోడౌన్ల ఆధునీకరణ, సామర్థ్యాన్ని పెంచడానికి చర్యలు చేపట్టారు. దీంతో పాటు కార్పొరేషన్ కొత్త భవనాల నిర్మాణ పురోగతిపై కూడా సమీక్షించారు. సాధారణ పంపిణీ విభాగం జనరల్ మేనేజర్ సుధాకర్ సాబొరా, ధాన్యం సేకరణ జనరల్ మేనేజర్ ఎలోరా సామల్, పాలనా విభాగం జనరల్ మేనేజర్ ప్రణతి ప్రియదర్శిని రౌత్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కొట్‌పాడ్‌లో రబీ మండీలు ప్రారంభం



బొబాయిలో ప్రారంభమైన మండీలో రైతులు, అధికారులు

జయపురం: వర్షాకాలం ప్రారంభం కాక ముందే మండీలకు వచ్చిన ధాన్యాన్ని ఖరీదు చేయాలని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితిలో కొట్‌పాడ్, బొబాయి లలో శనివారం జయపురం రెగ్యులేటింగ్ మార్కెటింగ్ కమిటీ వారు రబీ ధాన్యం మండీలను ప్రారంభించారు. ఈ మండీల్లో బొబాయి, నువాగాం,ఘుమరా పంచాయతీల సర్పంచ్‌లు, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు. బొబాయి మండీ వారంలో మూడు దినాలు ఉంటుందని, రోజుకు 3 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేస్తామని ఆర్ఎంసీ అధికారులు వెల్లడించారు. క్వింటాల్ ధాన్యం రూ.3,100కు ఖరీదు చేస్తారని పేర్కొన్నారు. డీఎల్‌సీ సమావేశంలో మే 25 నుంచి మండీలు ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ధాన్యం బస్తాలు ఉంచేందుకు ప్లాట్ ఫారంలు లేని మండిలలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై లేంప్స్, ఆర్.యం.సిలు దృష్టి సారించాలని రైతులు కోరారు. మండీల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని రైతులు, రైతు ప్రతినిధులు అధికారులను కోరారు.

ప్రధాని మోదీ పర్యటన వాయిదా



భువనేశ్వర్: రాష్ట్రంలో తొలి భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి పురస్కరించుకుని వార్షికోత్సవం సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయి. ఈ వేడుకల్లో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యక్ష హాజరు కోసం పార్టీ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఇటీవలి ఢిల్లీ పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వ వార్షికోత్సవానికి హాజరు కావాలని భారత ప్రధానమంత్రి, కేంద్ర హోం మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితర పార్టీ ప్రముఖులను సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి పిలుపు మేరకు కేంద్రం నుంచి పలువురు ప్రముఖులు రాష్ట్ర ప్రభుత్వం వార్షికోత్సవానికి హాజరుకానున్నట్లు సమాచారం. ఈనెల 12వ తేదీన రాష్ట్రంలో బీజేపీ సర్కారు వార్షికోత్సవం నిర్వహణ కోసం భారీ సన్నాహాలు చేశారు. అయితే ఇంతలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ రోజు హాజరు కాలేని పరిస్థితుల దృష్ట్యా, ఈ నెల 20న విచ్చేసేందుకు సానుకూలత వ్యక్తం చేశారు. లోగడ ఈనెల 12వ తేదీన జరగబోయే వార్షికోత్సవానికి విచ్చేయనున్నట్లు ప్రకటించారు. అయితే ప్రధానమంత్రి పర్యటనలో మార్పు చోటు చేసుకుందని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి తెలిపారు. అందువలన జూన్ 12న జరగాల్సిన ప్రధాన వార్షికోత్సవ కార్యక్రమాన్ని జూన్ 20కి వాయిదా వేశామని మంత్రి సురేష్ కుమార్ పూజారి తెలిపారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

- 4, 5 తరగతుల్లో ప్రవేశానికి నిరాశాజనకంగా దరఖాస్తులు

జయపురం: జయపురంలో ఈ ఏడాది నుంచి ప్రారంభంకానున్న కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఐదు రోజుల్లో 587 దరఖాస్తులను విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకెళ్లినట్టు అధికారులు శనివారం వెల్లడించారు. వారిలో 185 మంది ఇప్పటివరకూ దరఖాస్తులను అందజేశారన్నారు. 40 సీట్లు గల ప్రథమ తరగతి కోసం ఇంతవరకూ 73 మంది దరఖాస్తులు పెట్టుకొన్నారు. అలాగే 40 సీట్లు ఉన్న రెండో తరగతిలో చేరేందుకు 36 మంది, 40 సీట్లు ఉన్న మూడో తరగతిలో చేరేందుకు 38 దరఖాస్తులు చేరినట్లు అధికారులు వెల్లడించారు. అయితే 4, 5 తరగతులలో చేరేందుకు వచ్చిన దరఖాస్తులు నిరాశ జనకంగా ఉన్నట్లు అధికారులు చెప్పారు. నాలుగో తరగతిలో 40 సీట్లు ఉండగా కేవలం 19 దరఖాస్తులు, ఐదో తరగతిలో 40 సీట్లు ఉండగా కేవలం 19 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ఇంకా దరఖాస్తుల స్వీకరణకు సమయం ఉన్నా ఉన్న సీట్ల మేరకు దరఖాస్తులు వస్తాయా అన్నది ప్రశ్నార్థకమేనన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అందుకు ప్రధాన కారణం జయపురంలో కేంద్ర విద్యాలయం సకాలంలో ప్రారంభించక పోవటంతో అప్పటికే ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని స్థానికులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

చిత్రకొండ జలాశయంలో పడవ బోల్తా



జలాశయంలో గాలిస్తున్న ఓడ్రాఫ్ బృందం

- ఒకరి గల్లంతు



జలాశయం వద్ద ఎదురు చూస్తున్న కుటుంబసభ్యులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితిలోని జలాశయంలో శుక్రవారం సాయంత్రం నాటు పడవ బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు గల్లంతయ్యారు. నక్కమామ్మిడి పంచాయతీ బగూఢ గ్రామానికి చెందిన శంకర్ పోలాసి శుక్రవారం మధ్యాహ్నం పని మీద నాటు పడవపై వెళ్లాడు. తిరిగి ఒడ్డుకు వస్తున్న సమయంలో గాలీ వర్షం రావడంతో ఓవపోదర్ గ్రామం వద్ద పడవ బోల్తా పడింది. ఈ ఘటనలో శంకర్ చిక్కుకొని నీటిలో మునిగిపోయాడు. సాయంత్రం కావడంతో ఎవరూ జలాశయంలో దిగే ప్రయత్నం చేయలేదు. శనివారం తెల్లవారుజాము నుంచి ఓడ్రాఫ్ బృందం జలాశయంలో గాలించినప్పటికీ శంకర్ ఆచూకీ తెలియరాలేదు. సాయంత్రం వరకూ గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

ఆటో బోల్తా:డ్రైవర్‌కు గాయాలు



బోల్తా పడిన ఆటో



క్షతగాత్రుడిని చికిత్స కోసం తరలిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్ సమితి సరికిమహా పంచాయతీలోని గెరెంగగుడ గ్రామ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. శనివారం ఈ ఘటనలో డ్రైవర్ జలేంద్ర బిబార్ తీవ్రగాయాలకు గురయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానిక చేరుకుని అంబులెన్స్‌లో క్షతగాత్రుడుని మునిగుడ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆటోలో ప్రయాణికులు ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఏనుగుల బీభత్సం

- పంటలు ధ్వంసం



ఏనుగుల దాడిలో రాలిపోయిన పనస కాయలు



అరటి తోటను ధ్వంసం చేసిన దృశ్యం

రాయగడ: బిసంకటక్ సమితిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. కొద్ది రోజులుగా కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగులు ఎప్పుడు చొరబడి ఎటువంటి ఆపదను తీసుకువస్తాయోనన్న భయంతో గ్రామస్తులు వణికిపోతున్నారు. శుక్రవారం రాత్రి సమితిలోని కుటురిగుడ అడవుల నుంచి ఏనుగులు సరాసరి గ్రామంలోకి చొరబడి నానా బీభత్సం సృష్టించాయి. గ్రామానికి చెందిన నారాయణ హుయిక అనే ఆదివాసీ రైతుకు చెందిన పనస, అరటి తోటలను ధ్వంసం చేయడంతోపాటు అతను నివసించే పూరి గుడిసెను సైతం పాడుచేశాయి. ఏనుగుల రాకను గమనించిన హుయిక కుటుంబీకులు అక్కడి నుంచి పరుగులు తీసి తమ ప్రాణాలను కాపాడుకోగలిగారు. సమీపంలోని కుంభారోబడి గ్రామానికి వెళ్లి తలదాచుకున్నారు. ఇంటిని ధ్వంసం చేసిన ఏనుగులు అందులో ఉంచిన ధాన్యం, బియ్యం, చోడి తదితర వస్తువులను నేలపాలు చేశాయి. అలాగే ఇంటి బయట ఉన్న సోలార్ విద్యుత్ దీపాలను కుప్పకూల్చాయి. శనివారం ఉదయం అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానిక చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామార్శించారు. ఏనుగుల వల్ల కలిగిన ఆస్తి నష్టాన్ని అంచనా వేశారు. గ్రామస్తులు చెప్పిన ప్రకారం శుక్రవారం రాత్రి సుమారు 24 ఏనుగుల గుంపు ఒక్కసారిగా కుటురిగుడ గ్రామంలోకి చొరబడ్డాయి. వాటిలో కొన్ని అడవిలోనికి తిరిగి వెళ్లిపోగా కొన్ని మాత్రం బీభత్సాన్ని సృష్టించాయి. కొద్ది రోజుల క్రితం ఈ ఏనుగుల గుంపు కళ్యాణ సింగుపూర్ సమీపంలోని అడవుల్లో ఉండేవని ఆ గుంపే ఇక్కడకు వచ్చినట్లు అటవీ శాఖ అధికారులు అనుమానిస్తున్నారు. అడవులు అంతరిస్తుండటంతో ఏనుగులు తినేందుకు ఎటువంటి ఆహారం లభించకపోవడంతో ఆహారాన్ని వెతుకుంటూ గ్రామాల్లోకి చొరబడుతున్నాయని అధికారులు చెబుతున్నారు. వీటి బారి నుంచి గ్రామస్తులను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.



ఏనుల దాడిలో ధ్వంసమైన ఇల్లు

క్లుప్తంగా

టెక్కలి రవీంద్రభారతి పాఠశాలకు తాళాలు



పాఠశాలకు సీలు వేస్తున్న ఎంఈఓ తులసీరెడ్డి

టెక్కలి: టెక్కలిలో రవీంద్రభారతి పాఠశాలకు శనివారం మండల విద్యా శాఖాధికారి దల్లి తులసీరెడ్డి తాళాలు వేశారు. విద్యాశాఖ నుంచి ఎటువంటి గుర్తింపు అనుమతులు లేకపోవడంపై పలుమార్లు హెచ్చరించినా సంబంధిత యాజమాన్యం స్పందించకపోవడంతో పాఠశాలను శాశ్వతంగా మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌కేజీ నుంచి 7వ తరగతికి సంబంధించి విద్యా శాఖ నుంచి ఏటా అనుమతులు తీసుకోకుండా తాత్సారం చేశారని, దీనిపై పలుమార్లు హెచ్చరించినా స్పందించకపోవడంతో జిల్లా అధికారుల ఆదేశాలతో పాఠశాలను మూసివేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల బదిలీ సర్టిఫికెట్లు(టీసీ)లను తమ కార్యాలయం ద్వారా అందజేస్తామని తెలిపారు. కాగా, పాఠశాల మూసివేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

చెరువులో ఆక్రమణలు అడ్డగింత



జేసీబీతో జంగిల్ తొలగిస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక నరసన్న చెరువును శ్రీరామనగర్ సమీపంలో కొందరు వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడగా రెవెన్యూ సిబ్బంది స్పందించి అడ్డుకున్నారు. మాజీ సైనికులకు 1991లో చెరువు గర్భంలో పట్టా ఇచ్చారంటూ కొందరు శనివారం చెరువు భాగంలో ఉన్న జంగిల్‌ను జేసీబీతో శుభ్రం చేయించారు. స్థానికులు స్పందించి తహసీల్దార్ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఆయన స్పందించి ఆర్ఐ సాయిరాంకు తగు సూచనలు చేశారు. ఈ మేరకు వీఆర్వో చెరువు వద్దకు వెళ్లి పనులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

పోలాకి : రాజపురం వద్ద మట్టి ట్రాక్టర్ ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. కోలకతాకు చెందిన నాగాన ఆదిలక్ష్మి(54) బెలమర గ్రామంలో ఉన్న తన కుమార్తె ఇంటికి వచ్చింది. శనివారం సాయంత్రం గుల్లవానిపేట బీచ్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి తిరిగి వస్తుండగా.. అటుగా మట్టి తీసుకొస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆదిలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలాకి ఎస్ఐ రంజిత్ ఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసన్నపేట ఆస్పత్రికి తరలించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ దుర్మరణం

ఎచ్చెర్ల: చిలకపాలెం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై శనివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన లారీ క్లీనర్ సుబకాస్ మర్మర్ (35) మృతిచెందగా.. అస్సాంకు చెందిన డ్రైవర్ అసినాథ్ గాయాలపాలయ్యారు. గౌహతి నుంచి బెంగళూరు వెళ్తున్న కొరియర్ లారీ చిలకపాలెం వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. క్షతగాత్రులను 108 అంబులెన్సులో రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ క్లీనర్ మృతి చెందాడు. ఎచ్చెర్ల ఎస్సై ఎస్.కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ఘటనా స్థలంలో పడి ఉన్న ద్విచక్ర వాహనం

టెక్కలి రూరల్: మండలంలోని బర్మాకాలనీ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. టెక్కలి నుంచి రావివలస వైపు వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న చాకిపల్లి కొత్తూరు గ్రామానికి చెందిన పొన్నాడ రవి గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

లీజుకు ఆర్టీసీ ఖాళీ స్థలాలు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో వివిధ బస్‌స్టేషన్లలో 6 ఖాళీ స్థలాలను 15 ఏళ్ల లీజుకు ఇచ్చే ప్రాతిపదికన టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇచ్ఛాపురం, టెక్కలి, ఆమదాలవలస, ఎచ్చెర్లలో ఖాళీ స్థలాలకు సంబంధించి ఈ నెల 10న ఉదయం 11 గంటలకు శ్రీకాకుళం డ్రైవర్ల శిక్షణా కళాశాలలో ప్రీ బిడ్డర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెండర్ డాక్యుమెంట్లు, స్థలాల వివరాలను డ్రాయింగ్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 93460 45369 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గజపతి జిల్లాలో.. అభివృద్ధి పనులు ప్రారంభం



కాశీనగర్ బ్లాక్ పాలసింగి గ్రామంలో వివిధ ప్రభుత్వ పథకాలను పరిశీలిస్తున్న రాష్ట్ర మంత్రి రబినాయక్



రాష్ట్ర పంచాయతీ రాజ్, తాగునీరు, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి రబినారాయణ నాయక్‌ను జిల్లాకు ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కె.నారాయణరావు

పర్లాకిమిడి: రాష్ట్ర పంచాయతీ రాజ్, తాగునీరు, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి రబినారాయణ నాయక్ గజపతి జిల్లాలో ఒక రోజు పర్యటించారు. ఆయన శనివారం వేకువ జామున పర్లాకిమిడి విచ్చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నబకిశోర్ శోబోరో మంత్రిని స్వాగతించారు. మంత్రి రబినారాయణ నాయక్ కాశీనగర్ సమితిలో శియ్యాలీ, అల్లాడ, పాలసింగిలో ప్రభుత్వం ద్వారా అమలు జరుగుతున్న 'అమృత్ సరోవర్ పథకం' పనులను పర్యవేక్షించారు. అనంతరం పలుచోట్ల మొక్కలు నాటారు. అలాగే కాశీనగర్ బ్లాక్ ఖండవ పంచాయతీలో పాలసింగిలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన 'మెగా తాగునీటి పథకం' పైపులు విరిగిపోవడం రాష్ట్ర మంత్రి దృష్టికి ప్రజలు, పార్టీ నాయకులు తీసుకువచ్చారు. దీంతో గ్రామీణ తాగునీరు, శానిటేషన్ శాఖ ఇంజినీర్లకు మంత్రి రబినాయక్ చీవాట్లు పెట్టారు. పనులు తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ద్వారా వికసిత్ గావ్, వికసిత్ ఒడిశా కింద పదకొండు గ్రామాలకు తాగునీరు, రోడ్ల నిర్మాణానికి రూ.55.50 లక్షలతో పనులకు ఆయన కలెక్టరేట్ వద్ద శంకుస్థాపన చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్సు హాలులో జిల్లాలోని త్రాగునీరు, రోడ్లు-భవనాలు, గ్రామీణ శానిటేషన్, త్రాగునీరు, చిన్ననీటి పారుదలశాఖ, ఇంజినీర్లు అధికారులతో సమీక్ష సమావేశం జరిపారు. గజపతి జిల్లాలో అమృత్ సరోవర్ కింద సాగునీరు, తాగునీటి పథకాలు రుతుపవనాలు వచ్చే ముందే పూర్తిచేయాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పాలసింగి మెగా తాగునీరు, సాగునీటి ప్రాజెక్టుల్లో అవకతవకలు సరిదిద్దాలని కలెక్టర్‌తో అన్నారు. ఒడిశా ప్రాజెక్టుల ద్వారా పొరుగున వున్న ఆంధ్రప్రదేశ్ రైతులు వినియోగించుకుంటున్నారని, మన రైతులు సద్వినియోగం చేసుకోలేక పోతున్నారని సమీక్షా సమావేశానంతరం విలేకరులతో అన్నారు. అనంతరం దక్షిణ ఒడిశా వికాస్, శిక్షణ పొందిన 18 మందికి ఉపాధ్యాయ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మోహన ఎమ్మెల్యే దాశరథి గోమాంగోతో పాటు కలెక్టర్, డీఎఫ్ఓ ఎస్.నాగరాజు, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి శంకర్ కెరెకెటా, ఏడీఎం ఫాల్గుణ మఝి, అదనపు సీడీఎం పృధ్వీరాజ్ మండళ్ తదితరులు పాల్గొన్నారు.



గజపతి జిల్లాలో అమృత్ సరోవర్ ప్రాజెక్టులను ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి రబినారాయణ నాయక్



రాష్ట్ర మంత్రి రబినారాయణ నాయక్‌ను స్వాగతిస్తున్న మాజీ ఎమ్మెల్యే కె.నారాయణరావు, జిల్లా బిజేపీ పార్టీ అధ్యక్షులు నవకిశోర్ శోబోరో



వివిధ ప్రభుత్వ శాఖలతో సమీక్షాసమావేశంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి రబినారాయణ నాయక్

పుల్బణిలో ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రి: సీఎం



ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రి ప్రారంభించిన ముఖ్యమంత్రితో ఆరోగ్య శాఖ మంత్రి

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ శనివారం కంధమల్ జిల్లా పుల్బణి ప్రాంతంలో ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రిని ప్రారంభించారు. జిల్లా సందర్శన పురస్కరించుకుని రూ. 750 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయగా మరికొన్నింటిని ప్రారంభించారు. కొత్తగా ప్రారంభించిన ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో 100 సీట్లు, 650 పడకలు ఉన్నాయని ప్రకటించారు. కంధమల్ జిల్లా వాసుల చిరకాల ఆశ నెరవేరిందని, మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవలను పొందాలనే వారి చిరకాల కల సాకారమైందని ముఖ్యమంత్రి ఆనందం వ్యక్తం చేశారు. కంధమల్ ప్రాంతంలో ఈ వైద్య కళాశాల వైద్య విద్యను అందించడంతో నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను కూడా అందిస్తుందన్నారు. పరిసర ప్రాంతాల ప్రజల జీవితాల్లో పెద్ద మార్పు తీసుకురావడానికి దోహద పడుతుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆరోగ్య సేవా రంగంలో పేరుకు పోయిన పలు అవకతవకలు, అసమానతలను సవరించి వైద్య విద్యతో ప్రజలకు నాణ్యమైన, ఆరోగ్య సేవలను నిరంతరం అందుబాటులో ఉండేలా చేయడం ప్రభుత్వ సంకల్పంగా పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్ది సుసంపన్నంగా మార్చడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాల ఆసుపత్రులు స్థాపించడంతో వైద్య పోస్టుల సంఖ్యను పెంచడం పట్ల ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం సామాన్యుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తుందని, రాష్ట్రంలో మెరుగైన ఆరోగ్య సేవలను అందించే దిశగా మరో అడుగు ముందుకు వేస్తూ పుల్బణి ప్రాంతంలో కొత్త వైద్య కళాశాల ఆస్పత్రి ప్రారంభించడం సమగ్ర రాష్ట్రంలోనే ఆరోగ్య సంరక్షణలో కొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించడం జరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వం ఆరోగ్య సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. ఈ ఏడాది బడ్జెటులో ఆరోగ్య రంగానికి భారీగా రూ. 23,635 కోట్లు కేటాయించారని, ఇది బడ్జెట్ సమగ్ర పరిమాణంలో 8.2 శాతమని, ఇది రాష్ట్ర చరిత్రలో అత్యధికమని పేర్కొన్నారు.

పుల్బణి వైద్య కళాశాల ఆస్పత్రి కంధమల్, పరిసర ప్రాంతాల యువతకు వైద్య విద్యాభ్యాసంలో సరికొత్త అవకాశాలకు తలుపులు తెరిచిందన్నారు. 100 సీట్ల సామర్థ్యం గల ఈ కళాశాల నుంచి పట్టభద్రులైన తర్వాత వైద్య నిపుణులు భవిష్యత్‌లో ఒడిశాలోనే కాకుండా జాతీయ స్థాయి ఆరోగ్య సేవలు కల్పించడంలో ముఖ్యమైన పాత్ర పోషించాలని ప్రోత్సహించారు. మానవ సేవ మాధవ సేవ దృక్పథంతో విద్యాభ్యాసంలో అడుగిడి వైద్యునిగా ఎదిగి సమాజానికి నిరంతరం సత్వర సేవలు అందజేయడం కర్తవ్యంగా గుర్తించాలన్నారు. ఈ ఆస్పత్రితో కంధమల్ జిల్లాతో పొరుగున ఉన్న నయాగఢ్, బౌద్, కలహండి జిల్లాల ప్రజలకు కూడా ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. స్థానిక ఉపాధి, పరిశోధన, ఆర్థిక అభివృద్ధికి ఇది శక్తివంతమైన ఇంజిన్‌గా పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా కంధమల్ జిల్లా అభివృద్ధి కోసం సుమారు రూ.750 కోట్ల విలువైన 10 విభిన్న అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల్లోరూ. 655 కోట్లకు పైగా విలువైన 5 ప్రాజెక్టులను ప్రారంభించగా, రూ. 94 కోట్లకు పైగా విలువైన 5 ప్రాజెక్టులకు శంకు స్థాపన చేశారు. కంధమల్ జిల్లా జనాభాలో దాదాపు 54 శాతం మంది గిరిజన సమాజానికి చెందిన వారు ఉన్నారు. గిరిజనులకు అటవీ భూమి హక్కులను అందించడానికి జిల్లా యంత్రాంగం శ్రద్ధగా పని చేస్తోంది. అటవీ భూమి హక్కుల చట్టం కింద గత 6 నెలల్లో 20,000 పైబడి వ్యక్తిగత లీజులు జారీ చేశారు. రాష్ట్రంలో ఇక నుంచి భూమిలేని వ్యక్తి ఉండకూడదనే లక్ష్యంతో రానున్న రోజుల్లో జిల్లాలోని స్థలం వారందరికీ స్థలం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్, కంధమల్ లోక్ సభ సభ్యుడు సుకాంత్ కుమార్ పాణిగ్రాహి, పుల్బాణి నియోజక వర్గం శాసన సభ సభ్యుడు ఉమా చరణ్ మల్లిక్ పాల్గొన్నారు.

పికప్ వ్యాన్‌ను ఢీకొన్న ట్యాంకర్



బ్రిడ్జికి ఒకవైపు ఒరిగిపోయిన పికప్ వ్యాన్



గాయాలతో చికిత్స పొందుతున్న జారంగ

రాయగడ: కర్రల లోడుతో వెళుతున్న ఒక పికప్ వ్యాన్‌ను ట్యాంకర్ ఢీకొనడంతో కార్మికుడు తీవ్రగాయాలకు గురయ్యాడు. ఈ సంఘటన శనివారం సదరు సమితి పరిధిలో గల జేకేపూర్ సమీపంలో గల నాగావళి బ్రిడ్జి మధ్యలో చోటు చేసుకుంది. గాయపడిన వ్యక్తి పెంట గ్రామానికి చెందిన జారంగ జముకగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న చందిలి పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కొలనార నుంచి కళ్యాణసింగుపూర్ వైపు కర్రల లోడుతో పికప్ వ్యాన్ వెళ్తోంది. ఈ క్రమంలో నాగావళి బ్రిడ్జి మధ్య వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో పికప్ వ్యాన్ బ్రిడ్జికి ఒక వైపుగా ఒరిగిపోయింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శుభకార్యానికి వెళ్లి వస్తుండగా..

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ
- మహిళ దుర్మరణం



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు (ఇన్‌సెట్లో) సాయి (ఫైల్)

రణస్థలం: మండల కేంద్రం రణస్థలంలోని సూర్య స్కూల్ కూడలి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందింది. జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మసిగడాం జంక్షన్‌లో నివాసముంటున్న తోరాడ సాయి(36) జె.ఆర్.పురం జగనన్న కాలనీలోని శుభకార్యానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బంధువు ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. సూర్య స్కూల్ జంక్షన్‌లో రోడ్డు క్రాస్ చేసేందుకు ఆగారు. ఆ సమయంలో విశాఖపట్నం వైపు నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురూ కిందపడిపోయారు. సాయి తలభాగం నుజ్జయిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందగా.. మిగిలిన ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సాయి కమ్మ సిగడాం జంక్షన్‌లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్నారు. భర్త రామ్మూర్తి వంట పని చేస్తుంటారు. సాయి స్వగ్రామం దేవరాపల్లి. ఈమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. భర్త రామ్మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చిరంజీవి తెలిపారు.

'పనితీరును ప్రజలకు చెబుదాం'



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జెన్న, పక్కనే కలెక్టర్ పట్వారి తదితరులు



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాయగడ: అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజలకు బీజేపీ చేసిన ప్రజాహిత కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, వాటి తీరుతెన్నుల విషయమై ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అందుకు రాష్ట్రంలో గల ప్రతి జిల్లా కేంద్రంలో వికాష్ మేళా పేరిట ప్రదర్శనలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమైందని రాష్ట్ర రవాణా, వాణిజ్య, గనుల శాఖల మంత్రి బిభూతి జెన్న అన్నారు. రాయగడలో ఒక్కరోజు పర్యటనకు వచ్చిన ఆయన ఈ సందర్భంగా స్థానిక డీఆర్‌డీఏ సమావేశం మందిరంలో అధికారులతో సమీక్షించారు. ఈ నెల 12 వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రదర్శన మేళాను ఏర్పాటు చేయాలని, అందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవ్వాలని ఆదేశించారు. రాష్ట్రంలో బీజేపీ అధికార పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా చోటు చేసుకున్న పలు సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులు స్టాల్‌లను ఏర్పాటు చేసి ప్రదర్శించాలని అన్నారు. గుర్తింపు పొందిన జిల్లాల్లో కృషక్ మేళా, నారిశక్తి , యువశక్తి, ఆదివాసీ మేళాలను విస్తృతంగా ఏర్పాటు చేసేందుకు యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కలెక్టర్ ఫరూల్ పట్వారి, జిల్లా అదనపు కలెక్టర్ నవీన్ చంద్ర నాయక్, జిల్లా పరిషత్ కార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండో, సబ్ కలెక్టర్ రమేష్ కుమార్ జెన్న తదితరులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి జెన్న

సమీక్షా సమావేశం పూర్తయిన అనంతరం మంత్రి జెన్న విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలే భవిష్యత్‌లో పార్టీ మనుగడకు ఊపిరి పోస్తాయన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పార్టీ కృషి చేస్తుందని అన్నారు. రాయగడలో గల ఒఎస్ఆర్‌టిసి పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని ఉన్న బస్సులు పాతబడటంతో రద్దు చేయడంతో అందులో పనిచేసే సిబ్బంది, ఉద్యోగుల భవిష్యత్ అంధకారంగా మారిందన్న ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ త్వరలో ప్రభుత్వం కొత్త బస్సులను ఏర్పాటు చేసి యథావిధిగా కొనసాగిస్తుందని అన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవులు మృత్యువాత

ఎచ్చెర్ల: లావేరు మండలం ఇజ్జాడపాలెంలో తిరుపతి అనే వ్యక్తికి చెందిన ఆవు శనివారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పడి ఉన్న విద్యుత్ తీగలు తగిలి మృతి చెందింది. ఆవు విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతు కోరుతున్నారు.

కొనసాగుతున్న కంచమ్మతల్లి ఉత్సవాలు



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో కంచమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాలు ఆరో రోజైన శనివారం వైభవంగా జరిగాయి. అమ్మవారిని పీఠస్థానం నుంచి నేరుగా రైల్వే క్వార్టర్స్, మల్లా క్వార్టర్స్ మీదుగా ఎస్.ఆర్.సి.పురం కాలనీలో ఊరేగింపు చేపట్టారు. పార్వతీపురానికి చెందిన నమో వెంకటేశాయ, తాడేపల్లిగూడెం నవదుర్గలు, శ్రీకాకుళం దాండియా, గోపాల్‌పూర్ ధూమ్ ధమాకా, స్థానిక కళాకారుల గ్రూప్ డ్యాన్స్, పద్మనాభపురం పాలబొమ్మలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఢిల్లీ ఈవెంట్స్ ప్రోగ్రామ్‌కు జనం పోటెత్తారు. మరోవైపు అమ్మవారి నమూనా విగ్రహం ప్రాంగణం వద్ద వచ్చిన భక్తులకు పలువురు దాతలు ప్రసాదం పంపిణీ చేస్తున్నారు.

మూల్యం చెల్లించకతప్పదా!

- నేటికీ జిల్లాకు రాని కరోనా పరీక్ష కిట్లు
- పొరుగు జిల్లాలో ఓ వ్యక్తికి కరోనాగా నిర్ధారణ
- రాష్ట్ర వ్యాప్తంగా కేసులు పెరుగుతున్నా చలించని సర్కారు



శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం కరోనా పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేసులు పెరుగుతున్నా అందుకు తగ్గట్లు నివారణ చర్యలు చేపట్టకపోవడంతో తగిన మూల్యం చెల్లించాల్సివస్తోందేమోనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. వైఎస్ జగన్‌ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కోవిడ్ నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్న తరుణంలో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు అప్పట్లో తానే ముఖ్యమంత్రిగా ఉంటే కరోనా రాష్ట్రంలోకి వచ్చేదా అని ఓ బహిరంగ సభలో అనడం అందరికీ గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు ఆయనే ముఖ్యమంత్రిగా ఉండగా కరోనా నివారణకు కనీస చర్యలు చేపట్టకపోవడం విచారకరం. శ్రీకాకుళం జిల్లా వైద్యారోగ్యశాఖ కోవిడ్ పరీక్షా కిట్ల కోసం ప్రభుత్వానికి నివేదించి పది రోజులు కావస్తున్నా నేటికీ సరఫరా కాలేదు. కిట్‌ల కోసం ఎదురు చూసినా రిమ్స్ అధికారులు విశాఖపట్నం నుంచి పదుల సంఖ్యలో కిట్‌లను కొనుగోలు చేశారు. వ్యాధి లక్షణాలున్న అందరికీ కాకుండా తీవ్రమైన లక్షణాలు ఉన్నవారికి మాత్రమే పరీక్షలు జరుపుతున్నారు. కిట్ల కొరతే దీనికి కారణం.

విజయనగరంలో కలకలం..

పొరుగు జిల్లా విజయనగరంలో వ్యాధి లక్షణాలతో వచ్చిన ఓ రోగిని ఆసుపత్రిలో చేర్చి నిమోనియాగా చికిత్స చేస్తూ వచ్చారు. వారం రోజులైనా లక్షణాలు తగ్గకపోవడంతో రోగి నుంచి శాంపిల్‌ను సేకరించి పరీక్ష కోసం విశాఖపట్నం పంపించగా అతనికి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అప్పటికే ఆ రోగి పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో ఐసీయూలో ఉంచి చికిత్స జరుపుతున్నారన్న వార్త జిల్లాలో దావానంలా వ్యాపించింది. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరోవైపు, ప్రజలు కూడా జాగ్రత్త చర్యలు చేపట్టాలని వైద్య వర్గాలు సూచిస్తున్నాయి. మాస్కులు ధరించడం, ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకోవడం, సామాజిక దూరం పాటించడం, జన సమూహాలున్న ప్రాంతాలకు తప్పనిసరైతే తప్ప వెళ్లకుండా ఉండటం వంటివి చేయాలని సూచిస్తున్నారు. వ్యాధి లక్షణాలుంటే తక్షణం వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఛాతిలో నొప్పితో ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు వంటివి ఉంటే వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని సూచిస్తున్నారు.

ఒకటి రెండు రోజుల్లో..



ప్రభుత్వానికి కిట్ల విషయం నివేదించాం. ఒకటి రెండు రోజుల్లో వచ్చే అవకాశముంది. ర్యాపిడ్ కిట్లు 2500 వరకు ఉన్నాయి.

– డాక్టర్ కె. అనిత, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి, శ్రీకాకుళం

ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయుల ఆందోళన



ఆమదాలవలసలో ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఆమదాలవలస: ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదికతో ఇటీవల జరిగిన చర్చలలో ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించడానికి అంగీకరించినప్పటికీ ఇప్పుడు వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించాలని నిర్ణయించడం దుర్మార్గమైన చర్య అని ఐక్యవేదిక సంఘాల ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆమదాలవలస మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వర్గాలకు ఆర్థికపరమైన అంశాలలో ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి మేలు చేయలేదని, కనీసం ఆర్థికేతర అంశాలైన బదిలీలు కూడా మాన్యువల్‌గా నిర్వహించలేని నిస్సహాయస్థితిలో ఉండడం శోచనీయమన్నారు. సరైన సౌకర్యాలు లేని కారణంగా మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించలేమని చెప్పడం ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకొని ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆదివారం డీఈఓ కార్యాలయ ముట్టడికి ఉపాధ్యాయులంతా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు టి.వి.టి.భాస్కరరావు, బొడ్డేపల్లి గోపీచంద్, తమ్మినేని సీతారాం, కింతలి చంద్రరావు, నూక అప్పలనాయుడు, మెండ శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామతీర్థంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



రామతీర్థంలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో శనివారం పలువురు చిన్నారులు చేసిన సంప్రదాయబద్ధ నృత్య ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విజయనగరంలోని మయూరి నృత్యాలయ డైరెక్టర్ శ్రీదేవి కృష్ణ ఆధ్వర్యంలో స్వామి సన్నిధిలో విద్యార్థినులు నత్య నీరాజనాన్ని సమర్పించారు. రఘు కుల తిలకా రారా..నిన్నెత్తి ముద్దులాడెద రా..అంటూ జానపద గేయానికి చిన్నారులు చేసిన నృత్యం విశేషంగా ఆకట్టుకుంది.

హడలెత్తిస్తున్న ఏనుగులు



ఏనుగుల గుంపు ముందు గ్రామస్తుల పరుగులు

భామిని: మండలంలోని తాలాడలో నాలుగు ఏనుగుల గుంపు శనివారం హడలెత్తించింది. ఎండ తీవ్రత తగ్గిన వెంటనే తోట నుంచి బయటకు వచ్చి రోడ్లు వెంబడి సంచరించిన ఏనుగులు బెంబేలెత్తించాయి. కొద్ది రోజులుగా తాలాడ సమీపంలోని ఐలమ్మ తోటలో తిష్ఠ వేసిన ఏనుగులు ఆహారం కొరతతో సాయంత్రం బయటకు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఏనుగుల గుంపు వెంట స్థానికులు పరుగులు తీశారు. శుక్రవారం రాత్రి మొక్కజొన్న గింజల బస్తాలు ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు ఎటువైపు పయనిస్తుందోనన్న భయాందోళనతో ఏనుగుల వెంట వెళ్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

గోతిలో పడి కార్మికుడికి తీవ్ర గాయాలు



గాయపడిన ఆచారిని పరామర్శిస్తున్న పొట్నూరు తదితరులు

బొబ్బిలి: మండలంలోని అలజంగి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు అలజంగి ఆచారి శుక్రవారం రాత్రి బాడంగి, రామభద్రపురం మండల కేంద్రాలకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రామభద్రపురం-జగనన్న కాలనీల మధ్య ఉన్న పెద్ద గోతిలో పడిపోయాడు. దీంతో తల, కాలర్‌బోన్‌లకు గాయాలయ్యాయి. గాయపడిన ఆచారిని బాడంగి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆచారిని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకర రావు శనివారం వెళ్లి పరామర్శించారు. పేద కార్మికుడికి తీవ్ర గాయాలైతే ఆదుకోవాల్సిన భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, దీంతో పేదలైన కార్మికులు వీధిన పడుతున్నారన్నారు. ఆచారి నిరుపేద అని, ఇద్దరు చిన్న ఆడపిల్లలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడని, దాతలెవరైనా ఫోన్ 7780623626 నంబర్‌ను సంప్రదించి తోచినంత సహాయం చేయాలని కోరారు.

నేడు డీసీసీబీ చైర్మన్‌గా కిమిడి నాగార్జున బాధ్యతల స్వీకరణ

విజయనగరం అర్బన్: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా కిమిడి నాగార్జున ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టనున్నట్లు డీసీసీబీ సీఈఓ సీహెచ్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నగరంలోని ఫూల్‌బాగ్ రోడ్డులో ఉన్న 'జె' కన్వెన్షన్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయన పదవీ స్వీకారం చేస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి, కింజరావు అచ్చెన్నాయుడు. జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా గొంప కృష్ణ..

అలాగే జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా నియమితులైన గొంప కృష్ణ ఆదివారం బాధ్యతలు చేపట్టనున్నట్లు డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ సాయికుమార్ తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు నగరంలోని పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆటల్లేవు..ఆహ్లాదం లేదు..!

- అంగన్వాడీ కేంద్రాలకు అందని ఆట పరికరాలు
- ఆహ్లాదానికి దూరమవుతున్న చిన్నారులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ప్రీస్కూల్ చిన్నారుల భవితపై నిర్లక్ష్యం

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు	
అంగన్‌వాడీ కేంద్రాలు	2499
మెయిన్ కేంద్రాలు	2206
మినీ కేంద్రాలు	293
సొంత భవనాలున్నవి	788
అద్దె గదుల్లో నడుస్తున్నవి	1216
ప్రభుత్వ కార్యాలయాల్లో నడిచేవి	439
మూడేళ్లలోపు చిన్నారులు	42,16
ఐదేళ్ల లోపు చిన్నారులు	21,543



రామభద్రపురంలోని కనిమెరక వీధి అంగన్‌వాడీ కేంద్రంలో పాత ఆట వస్తువులతో ఆడిస్తున్న కార్యకర్తలు

రామభద్రపురం: అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే ప్రీస్కూల్ చిన్నారుల భవితను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ఆట పాటలతో చక్కగా సాగాల్సిన బాలబడులు అసౌకర్యాల మధ్య నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు ఆట పరికరాలు సరఫరా చేయకపోవడంతో చిన్నారులు ఆడుకునే పరిస్థితి లేక ఆహ్లాదానికి దూరమవుతున్నారు.రెండేళ్ల క్రితం అప్పటి వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం హయాంలో సరఫరాచేసిన ప్లాస్టిక్ ఆట వస్తువులు, పరికరాలు పిల్లలు ఆడుకోవడంతో పాడైపోయాయి. కొన్ని కేంద్రాల్లో మినహా ఎక్కడా ఆటపరికరాలు లేవు. ఉన్నకాడికి పాత ఆటవస్తువులు, పరికరాలతోనే ఆయా కేంద్రాల టీచర్లు ఆడించాల్సిన దుస్థితి నెలకొంది. కిచెన్ గార్డెన్, ప్రీస్కూల్ పాఠాలను ప్రోత్సహిస్తున్న పాలకులు, అధికారులు ఈ సమస్యను పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

మౌలికవసతులు లేక ఇక్కట్లు..

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం పంపిణీ చేసేందుకు ఏర్పడిన అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు.కనీస వసతులు లేని ఇరుకు కేంద్రాల్లో ఇబ్బందులు పడుతూ చిన్నారులకు అక్షరాలు నేర్పిస్తున్నారు. అద్దెభవనాలు, అద్దెలేని ఉచిత భవనాల్లోని ఇరుకు గదుల్లో చిన్నారులు సర్దుకుపోతున్నారు. కొన్ని పురాతన భవనాలు పెచ్చులూడిపోతున్నాయి. మరికొన్ని రేకుల షెడ్లలో గాలి ఆడక నానా అవస్థలతో చదువులు నేర్పిస్తున్నారు.ఈ కేంద్రాల వద్ద చిన్నారులు ఆడుకునేందుకు అవసరమైన మైదానాలు లేక కేంద్రాలకు వచ్చినప్పటి నుంచి నాలుగు గోడల మధ్య తప్ప బయటకు వెళ్లి ఆడుకునేందుకు వీలులేక బందీఖానాలుగా మారుతున్నారు. కొన్ని కేంద్రాల్లో పిల్లలు, కార్యకర్తలు, సహాయకులు, గర్భిణులు,బాలింతలకు ప్రశాంతమైన స్థలం కూడా లేదు. చిన్నారులకు చదువుతో పాటు ఆట,పాటలతో చదువుకునేందుకు అవసరమైన మౌలికవసతులు కల్పించాల్సిన కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



జీలికవలసలో రేకుల షెడ్‌లో అంగన్వాడీ కేంద్రం నిర్వహణ



మన్యం జిల్లాకు సరఫరా చేసిన ఆట వస్తువులు, పరికరాలను పరిశీలిస్తున్న అక్కడి ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, డీఎంహెచ్‌వో ఎస్ భాస్కరరావు(ఫైల్)

ప్రైవేట్‌ను ప్రోత్సహించేందుకేనా..?

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా చిన్నారులు ప్రీస్కూల్‌లో ఎక్కడ చేరితే అదే విద్యాసంస్థల్లో విద్యార్థిగా కొనసాగే అవకాశం ఉంటుంది. అంగన్‌వాడీ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తే చిన్నారులు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎల్‌కేజీ, యూకేజీల్లో చేరుతారు. ఆ తర్వాత కూడా ప్రైవేట్ పాఠశాలల్లోనే చదువు కొనసాగిస్తారు. దీంతో ప్రైవేట్ యాజమాన్యాలకు మేలు చేకూరుతుంది. కేవలం కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు చేకూర్చేందుకే ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని హంగులు..

చిన్నారుల్లో బాల్య దశలో విజ్ఞానంతో పాటు సృజనాత్మకతను పెంపొందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంగన్వాడీ కేంద్రాల్లో అనేక సంస్కరణలు చేపట్టారు.అందులో భాగంగా చిన్నారులకు ఆట పాటలతో కూడిన పుస్తకాలతో పాటు ఆటవస్తువులు, పరికరాలు పంపిణీ చేశారు.మన బడి నాడు నేడు పేరుతో పలు అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖల్ని మార్చేశారు. అధునాతన వసతులతో తీర్చిదిద్దారు. కేంద్రాల్లో ఉన్నంత సేపు చిన్నారులు చురుకుదనంతో ఉండేలా,కొత్తగా ఆలోచించేలా పరిసరాలను రూపుదిద్దడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ఇందుకు ఆట వస్తువులు సరఫరా చేయడమే కాదు. కేంద్రాల గోడలపై ఆకర్షణీయమైన చిత్రాలను గీయించారు. తరగతి గది నుంచి మరుగుదొడ్డి వరకు ఎటు వెళ్లినా ఏదో ఒక కొత్త అంశంపై ఆలోచించేలా బొమ్మలను చిత్రీకరించారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ విధానానికి మంగళం పాడింది.బాల్య దశలోనే విద్యా పరంగా గట్టి పునాదులు వేసే అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు చేస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

త్వరలో ఆట పరికరాలు వస్తాయి..

అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు సంబంధించి ఆట వస్తువులు, పరికరాలు ఇంకా రాలేదు.త్వరలో వచ్చే అవకాశం ఉంది. ముందుగా పాఠ్యపుస్తకాలు సరఫరా చేశారు. క్రీడా పరికరాలు వచ్చిన వెంటనే కేంద్రాలకు సరఫరా చేస్తాం. ప్రస్తుతం కేంద్రాలలో ఉన్న పాత ఆట వస్తువులతోనే అంగన్‌వాడీ కార్యకర్తలు ఆడిస్తున్నారు. చిన్నారులకు ఎలాంటి సమస్య లేకుండా చూస్తాం.

రాజ్యలక్ష్మి, సీడీపీవో, బాడంగి ప్రాజెక్టు

ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో మలేరియా ప్రభావిత ప్రాంతాలు ఉన్నాయని ఆయా ప్రాంతాల్లో మరింత సమర్థవంతంగా డ్రైవ్‌ను నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో మంచి పారిశుద్ధ్య పరిస్థితులు ఏర్పడాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అందుకు గ్రామ పంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్త సేకరణ జరగాలని వాటిని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. వ్యక్తిగతంగా, గృహపరంగా పరిశుభ్రమైన వాతావరణం కలిగి ఉండాలని తద్వారా రోగాలకు దూరంగా ఉండవచ్చన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని కోరారు. నీటి నిలవకు అవకాశం లేకుండా ఖాళీ కొబ్బరి బొండాలు, సీసాలు, టైర్లు, పాత్రలు తదితర పరికరాలపై దృష్టిసారించి అవి ఎక్కడ లేకుండా చూడాలని స్పష్టం చేశారు.

జూన్‌లోనే పారిశుద్ధ్య డ్రైవ్

జూన్ నెలలోనే జిల్లాలో పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టడం వల్ల రానున్న నెలల్లో సులభతరమవుతుందన్నారు. మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయడం, దోమల నివారణ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. గ్రామాల దగ్గరలో ఉండే నీటి వనరులలో గంబూషియా చేపలను వదలడం వల్ల లార్వా నిరోధక వ్యవస్థగా పనిచేస్తుందని చెప్పారు. ప్రతి ఇంట్లోనూ, బయట దోమల నివారణగా స్ప్రేయింగ్ జరగాలని ఆదేశించారు. దోమ తెరల ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పురపాలక సంఘాల్లో కూడా పెద్ద ఎత్తున శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని, కాలువల్లో పూడికలు తీయాలని, మురుగునీరు ఎక్కడా నిలవ లేకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

- కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ల ఐక్యవేదిక పిలుపు

విజయనగరం గంటస్తంభం: దేశవ్యాప్తంగా జూలై 9న జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ల వేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్ అధ్యక్షతన స్థానిక జెడ్పీ మినిస్టీరియల్ భవనంలో జిల్లా సదస్సు శనివారం జరిగింది. సదస్సులో వారు మాట్లాడుతూ..కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక వర్గం మీద బహుముఖ దాడి చేపట్టిందని, 95 శాతంగా ఉన్న కార్మికులకు తీవ్రమైన నష్టం చేకూర్చే విధంగా కార్మిక చట్టాలు, హక్కులపై దాడి చేస్తోందన్నారు. కార్మికులకు ప్రశ్నించే హక్కు లేకుండా, పని గంటలతో సంబంధం లేకుండా కార్మికులను బానిసలుగా చేసే పరిస్థితి నేడు మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. నేడు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు అప్పగించే పాలన సాగుతోందని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చేసి కార్మికులను బానిసలుగా మార్చే ప్రక్రియ మోడీ ప్రభుత్వం చేపట్టింది. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడాన్ని ప్రతిఘటించపోతే కార్మిక వర్గాల మనుగడ ప్రమాదంలో పడుతుంది. ఇటువంటి నేపథ్యంలో పోరాడి సాధించుకున్న చట్టాలను, హక్కులను, సమ్మె చేసే హక్కును, కనీస వేతనాల సాధన కోసం, ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడం కోసం జూలై 9 తేదీన జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో జిల్లాలో అన్ని వర్గాలు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తమ్మనేని సూర్యనారాయణ, వెంకటేశ్వరావు, శంకరరావు, ఈశ్వరరావు, రవికుమార్, గీత, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీనియర్ సిటిజన్ల యోగా

పార్వతీపురంటౌన్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సీనియర్ సిటిజన్ల యోగా కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం సాయంత్రం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సాలూరు, పార్వతీపురం, పాలకొండ మున్సిపాలిటీల పరిధిలో సీనియర్ సిటిజన్ లతో యోగా కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమాన్ని బాగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమంలో పోటీలను పూర్తి చేయాలని అనంతరం జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ తేజేశ్వరరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి బి.చంద్ర శేఖర్, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

సేదదీరుతూ అనంతలోకాలకు..!

- నిద్రపోతున్న కూలీని గమనించని లారీ డ్రైవర్
- నల్ల పిక్కలో కూరుకుపోయి కూలీ దుర్మరణం
- మూడు రోజుల తర్వాత వెలుగుచూసిన విషాద ఘటన





ముదపాకలో ఘటనాస్థలంలో సీఐ సతీష్‌కుమార్,(ఇన్‌సెట్లో) నల్ల పిక్క మధ్యలో సూరన్న దొర మృతదేహం



మృతుడు సూరన్న దొర(ఫైల్)

పెందుర్తి: ఓ నిర్మాణ కూలీ జీవితం నిద్రలోనే కడతేరింది. తాను పనిచేస్తున్న చోటే సేద తీరుతుండగా విధి చిన్నచూపు చూడడంతో ఊపిరాడక అసువులు బాశాడు. పెందుర్తి మండలం ముదపాకలోని జగనన్న కాలనీలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పెందుర్తి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా తెర్లాం మండలం నందబలగ గ్రామానికి చెందిన పక్కి సూరన్నదొర (57), గంగమ్మ దంపతులు కుటుంబంతో కలిసి ముదపాకకు వలస వచ్చి ఇక్కడి జగనన్న కాలనీలో నిర్మాణ పనులు చేస్తుంటారు. సూరన్నదొర అన్న కుమారుడు పక్కి ప్రసాద్ ఈ నెల 4న ఇదే ప్రాంతంలో బావిలో పడి మృతి చెందాడు. ఈ క్రమంలో ప్రసాద్ మృతదేహం పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు వెళ్లిన సూరన్న.. నీరసంగా ఉండడంతో ముదపాకలోని ఇంటికి తిరిగి వచ్చేశాడు. తీవ్ర విషాదంలో ఉన్న సూరన్న ముదపాకలోనే ఉన్న బంధువులతో అదే రోజు సాయంత్రం మద్యం తాగాడు. ఉదయం మళ్లీ కేజీహెచ్‌కు వెళ్లి మృతదేహంతో ఊరికి వెళ్తానని చెప్పాడు. అనంతరం సమీపంలో నిర్మాణం కోసం పోసి ఉన్న నల్ల పిక్క రాశిపై పడుకున్నాడు. అయితే అర్ధరాత్రి అక్కడికి పిక్క వేసేందుకు వచ్చిన లారీ డ్రైవర్ సూరన్న నిద్రిస్తున్న విషయాన్ని గమనించకుండా అతనిపైనే అన్‌లోడ్ చేసేశాడు. అప్పటికే గాఢ నిద్రలో ఉన్న సూరన్నదొర ఊపిరాడక మరణించినట్లు పోలీసులు భావిస్తున్నారు.

మూడు రోజుల తర్వాత వెలుగులోకి...

కేజీహెచ్‌కు వెళ్తానని చెప్పిన సూరన్న కనిపించకపోవడంతో విజయనగరం వెళ్లిపోయాడని అందరూ భావించారు. కానీ అతను అక్కడికి కూడా రాకపోవడంతో కుటుంబసభ్యులు ప్రసాద్ అంత్యక్రియలు నిర్వహించకుండా చాలాసేపు ఎదురుచూశారు. చివరకు ఆ కార్యక్రమం పూర్తి చేసుకున్న కుటుంబ సభ్యులు గురువారం తిరిగి ఇక్కడికి వచ్చి సూరన్న ఆచూకీ కోసం ఆరా తీశారు. ఈ క్రమంలో అతను అదృశ్యమైనట్లు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేద్దామని నిర్ణయించుకున్నారు. అయితే శనివారం ఉదయం కాలనీలో నిర్మాణ పనుల కోసం నల్ల పిక్కను తరలించేందుకు పొక్లెయిన్‌తో లారీలకు లోడ్ చేస్తున్నారు. ఆ సమయంలో నల్ల పిక్క రాశి నుంచి ఓ చేయి బయటకు కనిపించడం, ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా దుర్వాసన రావడంతో ఆందోళనకు గురైన పొక్లెయిన్ ఆపరేటర్ విషయాన్ని కాలనీవాసులకు, గ్రామస్తులకు తెలిపాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయగా, అది సూరన్నదొరదేనని కుటుంబ సభ్యులు గుర్తించారు. ప్రాథమిక విచారణ చేపట్టిన సీఐ కె.వి.సతీష్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏడాది కిందట రైలు ప్రమాదంలో సూరన్న కుమారుడు, మూడు రోజుల కిందట ప్రమాదవశాత్తు బావిలో పడి అతని అన్న కుమారుడు మృతి చెందడంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబంలో.. ఈ తాజా విషాదం తో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

యథేచ్ఛగా విద్యుత్ చౌర్యం

- పుట్టగొడుగుల్లా షాపులు
- సహకరిస్తున్న విద్యుత్ సిబ్బంది
- రెడ్డి కంచేరులో విద్యుత్‌కష్టాలు
- గ్రామానికి లోడు సరిపడక ప్రజలు అవస్థలు



అంధకారంలో ఉన్న రెడ్డి కంచేరు గ్రామం



గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు కర్రలు కట్టి విద్యుత్ చౌర్యం

భోగాపురం: మండలంలోని రెడ్డి కంచేరు గ్రామ ప్రజలు విద్యుత్ కష్టాలతో గడిచిన కొన్ని నెలలుగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి అతి సమీపంలోనే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణమవుతోంది. ఇదే అదునుగా కొంత మంది అక్రమార్కులు గ్రామంలోని రహదారులను ఆక్రమించి పదుల సంఖ్యలో కొత్త షాపులను నెలకొల్పారు. ఇంతవరకు బాగానే ఉన్నా..షాపులకు నిత్యం విద్యుత్ చౌర్యం చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు కర్రలు కట్టి మరీ విద్యుత్ చౌర్యం చేస్తున్నారని, దీనివల్ల గ్రామానికి లోడు సరిపడక విద్యుత్ సరఫరాలో నిత్యం ఆటంకం ఏర్పడుతోందని వాపోతున్నారు. విద్యుత్ చౌర్యం పట్టపగలే బహిరంగంగా జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీసం స్పందించడం లేదని, షాపుల నిర్వాహకులకు ప్రత్యక్షంగా సహకరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా..గ్రామానికి విద్యుత్ సరఫరా అయ్యే ప్రధాన ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కర్రలు కట్టి చౌర్యానికి పాల్పడుతున్నారని వాపోతున్నారు. దీంతో ప్రతి రోజూ రాత్రి 7 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడుతోందని, వేసవి కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులకు సహకరిస్తూ సుమారు 2వేల మంది జనాభా ఉన్న గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నరకయాతన అనుభవిస్తున్నాం

ప్రతిరోజూ విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడుతుండడంతో నరకయాతన అనుభవిస్తున్నాం. ఇంత ఘోరం ఎన్నడూ చూడలేదు. వేసవికాలం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అక్రమార్కులకు సహకరించకుండా గ్రామానికి విద్యుత్ సరఫరాను సక్రమంగా ఇవ్వాలి. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ స్పందించడం లేదు.

కొల్లేటి అప్పలరాజు, రెడ్డి కంచేరు

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కర్రలు కట్టి యథేచ్ఛగా దొంగతనంగా విద్యుత్‌ను ఉపయోగించుకుంటున్నారు. మాకు సరఫరా సక్రమంగా అందివ్వడం లేదు. కానీ నెల నెలా బిల్లులు చూస్తే నిజంగానే షాక్ కొడుతోంది. గ్రామానికి మానేసి షాపులకు దొంగతనంగా విద్యుత్‌ను ఎలా సరఫరా చేస్తారు? విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

సీరపు అప్పలరాముడు, రెడ్డి కంచేరు

విద్యాశాఖ మంత్రి రాకకు ఏర్పాట్ల పరిశీలన



పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

పార్వతీపురం టౌన్: రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్ జిల్లా పర్యటనకు సోమవారం రానున్న దృష్ట్యా మంత్రి గుమ్మడి సంధ్యారాణి, రాష్ట్ర ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఏఎస్పీ అంకిత సురానా ఏర్పాట్లను పరిశీలించారు. పార్వతీపురం పట్టణంలో పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సత్కార కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడే కార్యక్రమాన్ని స్థానిక రాయల్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేయగా వసతులను వారు పరిశీలించారు. ఏర్పాట్లు పక్కాగా చేయాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. అనంతరం చినబొండపల్లిలో జరిగే కార్యక్రమం ఏర్పాట్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ తేజేశ్వరరావు, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి బి.చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ రిజిస్ట్రేషన్

విజయనగరం ఫోర్ట్: ఎంబీబీఎస్ పూర్తి చేసిన వైద్య విద్యార్థులు వైద్యుడిగా ప్రాక్టీస్ చేసుకోవడానికి ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అదే విధంగా ఐదేళ్లకు ఒకసారి రెన్యూవల్ చేసుకోవాలి. ఈ ప్రక్రియను ఏపీ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గాజులరేగ వద్ద ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు రిజిస్ట్రేషన్‌తో పాటు రెన్యూవల్ కోసం వైద్యులు విజయవాడ వచ్చేవారని, దీంతో ఇబ్బంది పడుతున్నారని ఉద్దేశంతో జిల్లాలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలల్లో దీన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆదివారం కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, ఐఎంఏ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.జయచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కోవిడ్ కేసు నమోదు

- నెల్లిమర్ల మండలం పారసాం వ్యక్తికి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో తొలి కోవిడ్ కేసు నమోదైంది. నెల్లిమర్ల మండలం పారసాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జ్వరం, దగ్గు, ఆయాసంతో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 10 రోజుల క్రితం చేరారు. అతనికి వైద్య పరీక్షలు చేసిన వైద్యులు నిమోనియా అనుకుని ఆసుపత్రిలోని స్టెప్ డౌన్ ఐసీయూలో చేర్చి చికిత్స అందించారు. శుక్రవారం అతనికి కోవిడ్ పరీక్ష కోసం శాంపిల్ తీసి విశాఖలోని కేజీహెచ్‌కు పంపించారు. అక్కడ ఆర్‌టీపీఎస్ఆర్ పరీక్ష చేయగా అతనికి కోవిడ్ పాజిటివ్ వచ్చింది. ఆసుపత్రిలో చేరినప్పుడు అతనికి ఆక్సిజన్ లెవల్స్ 45 నుంచి 60 ఉండేది. ప్రస్తుతం ఆక్సిజన్ లెవల్స్ 90 నుంచి 91 మధ్య ఉంది. దీంతో అతన్ని ఆసుపత్రి వైద్యాధికారులు శనివారం డిశ్చార్జ్ చేసి హోం ఐసోలేషన్‌లో ఉండాలని సూచించారు.

ఇంకా అందుబాటులోకి రాని ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఇంకా ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు అందుబాటులోకి రాలేదు. ఆర్‌టీపీఎస్ఆర్ పరీక్షలు చేయడానికి అవసరమైన ల్యాబ్‌ను ఇంకా సిద్ధం చేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కోవిడ్ లక్షణాలు ఉన్న వారి నుంచి శాంపిల్స్ తీసి విశాఖపట్నం కేజీహెచ్‌కు పంపిస్తున్నారు.